

మొగులయ్యకు నియామకపత్రం అందిస్తున్న డీసీవో ఈశ్వరయ్య, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

మొగులయ్య ఏకగ్రీవం

● కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్‌గా నియామకం

కులకచర్ల, ఫిబ్రవరి 18: కులకచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా తిరుమలాపూర్ గ్రామానికి చెందిన మొగులయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సొసైటీ కార్యాలయంలో చైర్మన్ ఎన్నికను డీసీవో ఈశ్వరయ్య నిర్వహించారు. మొత్తం 13 మంది డైరెక్టర్లు హాజరు కాగా చైర్మన్ పదవికి మొగులయ్య ఒక్కరే నామినేషన్ వేశారు. దీంతో మొగులయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు డీసీవో ప్రకటించారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రతిపాదించడంతో డైరెక్టర్లు ఆయన్ను ఎన్నుకున్నారు. సీఈవో బక్కారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్-బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు కుమ్మరి స్వామి, ఎంపీటీసీ ఆనందం తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన నారాయణపూర్

తాండూరు మండలం నారాయణపూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ, కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు పెద్దఎత్తున బోనాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఊరేగింపులో డప్పుచప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టున్నాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

-తాండూరు రూరల్, ఫిబ్రవరి 18



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



సంగయపల్లి అడవిలో నరికిన చెట్లు

అడవి తల్లిపై గొడ్డలి వేటు!

● సంగయపల్లి అటవీ భూమిలో చెట్ల నరికివేత

ధారూరు, ఫిబ్రవరి 18: ధారూరు అటవీ రేంజ్ పరిధిలోని సంగయపల్లి అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి.రాత్రిపూట ఎక్స్‌కవేటర్లతో అడవిలోని చెట్లు, పొదలను తొలగించి అక్రమార్కులు దర్జాగా కబ్జాకు పాల్పడుతున్నారు. సంగయపల్లి తండాకు చెందిన కొందరు అటవీలోని చెట్లను నరికి భూములను చదును చేస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవటం లేదు. అడవిలోని విలువైన వృక్ష సంపద నేల మట్టం అవుతోంది. కబ్జాదారులు ముళ్లపొదలను తొలగించి అటవీ ప్రాంతాన్ని చదును చేసి పంట పొలాలుగా మార్చుకుంటున్నారు. గత ప్రభుత్వంలో పోడు పట్టాలు జారీ చేసిన తర్వాత తిరిగి అటవీ భూములు అక్రమణకు గురవుతున్నాయి. అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో పాటు రేంజర్ పదవీవిరమణ ఉండటంతో పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఉన్నతాధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సీఎంను కలిసి...



తాండూరు, ఫిబ్రవరి 18: తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా మాజీ ఎంపీ రాజయ్య, సభ్యుడిగా తాండూరుకు చెందిన ఎం.రమేష్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం వారు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి ఫైనాన్స్ కమిషన్ కార్యాలయానికి వెళ్లి రాజయ్య, రమేష్‌లకు అభినందనలు తెలిపారు.

పరిగిలోనివెంకటేశ్వరాలయం వాణిజ్య సముదాయం



గలీజు దందా!

బినామీల అడ్డాగా పరిగిలోని వాణిజ్య సముదాయాలు

- లక్షలు వెచ్చించి నిర్మించినా... ప్రభుత్వ సంస్థల ఆదాయానికి గండి
- సబ్ లీజ్‌లతో బినామీలకు డబ్బులే డబ్బులు
- పట్టించుకోని అధికారులు

పరిగిలోని వాణిజ్య సముదాయాల పరిస్థితి సొమ్ము ఒకరిది.. సోకు మరొకరిది అన్న చందంగా ఉంది. వివిధ ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో లక్షలు వెచ్చించి వాణిజ్య సముదాయాలను నిర్మించారు. అయితే ఈ సముదాయాలు అటు సంస్థలకు కాకుండా.. ఇటు నిజంగా వ్యాపారం చేసుకునే వారికి కాకుండా మధ్య బినామీలకు దందాగా మారింది. ఈ తతంగం ఏళ్ల తరబడి కొనసాగుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రాజకీయ పలుకుబడి, బడా వ్యాపారుల ఒత్తిడితో పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో ప్రభుత్వాదాయానికి భారీ గండి పడుతోంది.

పరిగి, ఫిబ్రవరి 18: ప్రభుత్వ అనుబంధ సంస్థల ఆస్తులు బినామీలకు ఆదాయ వనరులుగా మారాయి. పరిగి పట్టణంలో మదర్‌డెయిరీ, డీసీఎమ్మెస్, మునిసిపల్, గ్రంథాలయం, వేంకటేశ్వరదేవాలయం, మార్కెట్ కమిటీ టీఎన్‌జీవోస్, ఆర్టీసీ సంస్థల ఆధ్వర్యంలో వాణిజ్య సముదాయాలు నిర్మించారు. కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ



మదర్ డెయిరీ వాణిజ్య సముదాయం

పలుకుబడితో మరికొందరు వ్యాపారులు దుకాణాలను తక్కువ ధరలకు దక్కించుకున్నారు. వాటిని ఇతరులకు మూడింతల సబ్ లీజులకు ఇస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మదర్ డెయిరీకి చెందిన 45షాపులు, మునిపిపల్‌కు చెందిన 27 దుకాణాలు, డీసీఎమ్మెస్‌కు చెందిన 25 షాపులు, ఆర్టీసీకి చెందిన 20 షాపుల వరకు, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి చెందిన 22, మార్కెటింగ్, టీఎన్‌జీవోకు చెందిన ఏడు, గ్రంథాలయ శాఖకు చెందిన నాలుగు షాపులు కలిపి మొత్తం 157 దుకాణ సముదాయాలున్నాయి. వీటిలో మునిసిపల్‌కు చెందిన దుకాణ సముదాయంలో ఒక్కొక్క షాపునకు రూ.13,600, మదర్‌డైరీలో ఒక్కొక్క దుకాణానికి రూ.10వేలు, డీసీఎమ్మెస్‌లో రూ.6,050 చొప్పున, గ్రంథాయలం, వేంకటేశ్వర దేవాలయానికి చెందిన ఒక్కొక్క దుకాణానికి రూ.2000 నుంచి రూ.4000 వరకు అద్దెను నిర్ణయించారు. అయితే ఈ అద్దెలు దుకాణాలు నిర్మించిన సమయంలో నిర్ణయించినవే కావడం గమనార్హం. ఈ దుకాణాలకు రెండేళ్లకోసారి అద్దెను పెంచడంతో పాటు, ఎవరి పేరున ఉందో వారే లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ 90శాతం బినామీలే కొనసాగుతున్నారు.



పరిగిలోనీ డీసీఎమ్మెస్ వాణిజ్య సముదాయం

రికార్డులు మాయం

మదర్ డెయిరీ, డీసీఎమ్మెస్, మునిసిపల్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, టీఎస్‌జీవోస్, ఆర్టీసీ సంస్థలకు పరిగిలోని వాణిజ్య సముదాయాల ద్వారా మంచి ఆదాయమే ఉన్నప్పటికీ వాటిపై దృష్టి సారించడం లేదు. ఆదాయం లేని ఇతర వాటిపై దృష్టి సారించడం గమనార్హం. వారం రోజుల క్రితం దేవాదాయశాఖ అధికారులు టెంపుల్‌కు సంబధించిన ఆస్తుల గురించి తెలుసుకునే ప్రయత్నం చేయగా ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. దుకాణాల కోసం ఇచ్చిన అడ్వాన్స్‌లు, నెల అద్దెలకు సంబంధించి రికార్డులు లేకపోవడంతో అధికారులు కంగుతినాల్సి వచ్చింది. ఇలా ప్రభుత్వ సంస్థలకు చెందిన ఆస్తుల అద్దెలకు సంబంధించి పెద్ద కుంభకోణమే జరుగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా ప్రభుత్వ సంస్థల నుంచి వచ్చే ఆదాయాన్ని వదులుకుని, రానిచోట ఎందుకు పాకులాటని స్థానికులు పేర్కొంటున్నారు.

వాణిజ్య సముదాయాల్లో ఉంటున్నది ఎవరు?

ఇదిలా ఉంటే, వివిధ ప్రభుత్వ సంస్థల సంబంధించిన దుకాణ సముదాయాల్లో షాపులను ఎవరికి అద్దెకు ఇచ్చింది అనే వివరాలు కూడా అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. షాపుల్లో అందరూ బినామీలే తిష్ట వేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అతి తక్కువ అద్దె...అడ్వాన్స్‌లకు దక్కించుకున్న స్థానిక ప్రముఖులు వాటిని ఇతర వ్యక్తులకు సబ్ లీజులకు ఇచ్చి భారీగా లబ్ధి పొందుతున్నారు. దీంతో లక్షలు వ్యయం చేసి నిర్మించిన వాణిజ్య సముదాయాల నుంచి ప్రభుత్వానికి పెద్దగా ఆదాయం రావడం లేదు. బినామీలే లబ్ధి పొందుతున్నారు. మొదట్లో షాపులను దక్కించుకున్న వారు మాత్రం ఇతరులకు సబ్‌లీజులకు ఇచ్చి ఒక్కోషాపుకు రూ.15 నుంచి రూ.25 వేల వరకు అద్దె రూపంలో వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు ఒక్కో షాపునకు ఏడాదికి రూ.లక్షన్నర నుంచి రూ.రెండుల లక్షల అడ్వాన్సులు తీసుకుని సబ్‌లీజులకు ఇచ్చుకుంటున్నారు. అయితే లీజుదారులు సబ్‌లీజులకు ఇచ్చి దర్జాగా అదనపు సంపాదన వస్తున్న విషయం ఆయా సంస్థల అధికారులకు తెలుసు. అయినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో ఎవరికీ అర్థం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.20 కోట్లు

● పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



సీసీ రోడ్డు పనుల శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్

దోమ, ఫిబ్రవరి 18: నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి రూ.20కోట్లు మంజూరు చేశారని, గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. ఆదివారం ఉదన్‌రావుపల్లి, దోమ, లింగంపల్లి, అయినాపూర్ గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత మొదటిసారి ఉదన్‌రావుపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశానన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ భవననిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, రాఘవేందర్‌రెడ్డి, ఎంపీటీసీ విజయగోపాల్‌గౌడ్, దోమ ఎంపీటీసీ అనితయాదయ్యగౌడ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, అధికారులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు కృష్ణ, రమేశ్, గోపాల్, రమేశ్, బురాన్, నర్సింహులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి శంకుస్థాపన



రాజగోపురానికి శంకుస్థాపన చేసిన రామానందప్రభూజీ

కీసర రూరల్, ఫిబ్రవరి 18 : ఆధ్యాత్మికతకు నిలయాలుగా దేవాలయాలు విలసిల్లాలని సాయిదత్త పీఠాధిపతి రామానంద ప్రభూజీ అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీ రమా సత్యనారాయణ దేవాలయంలోమున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డితో కలిసి రాజగోపుర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ అన్నంరాజ్ లావణ్య, సుమిత్ర, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అన్నంరాజ్ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు హరగోపాల్, రాంచందర్, శ్రీనివాస్‌రెడ్డి, వాడపల్లి శ్రీనివాస్, జివెంకటేశ్వర్ రావు, ఉమాశంకర్, వేదవతి, బద్రీనారాయణ, పవన్‌కుమార్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సభ్యులు నాగరాజు, శ్రీనివాస్, పుండరీకం, బద్రునాయక్ పాల్గొన్నారు.

29 నుంచి పోలెపల్లి ఎల్లమ్మ జాతర

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 18: ఈ నెల 29 నుంచి బొంరాస్‌పేట్ మండలం పోలెపల్లి గ్రామంలో ఎల్లమ్మ దేవత బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఈవో రాజేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ ముచ్చట వెంకటేశ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 29న రాత్రి గ్రామంలోని పురవీధుల గుండా ఆలయం వరకు అమ్మవారి పల్లకీ సేవ, మార్చి 1న సిడే, 2న రథోత్సవం (తేరులాగుట), 3, 4 తేదీల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మినీ మేడారంగా పేరొందిన పోలెపల్లి ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు మాణిక్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్‌రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 18: విద్యారంగ సమస్యల పరిష్కారానికి దశలవారీగా పోరాటాలకు సిద్ధం కావాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు మాణిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రత్నం ఆధ్వర్యంలో ఆదివారం వికారాబాద్‌లోని న్యూనాగార్జున హైస్కూల్‌లో టీఎస్‌యూటీఎఫ్ వికారాబాద్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం సంఘం సభ్యులు కృషి చేయాలన్నారు. పదేళ్ల నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం ఏర్పడిన కొత్త ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా పాలనలో కొత్త ఒరవడిని తెచ్చిందని ఆయన కొనియాడారు. అటు దేశంలోని కేంద్రప్రభుత్వం పదేండ్ల నుంచి ఐటీ మినహాయింపులు పెంచకపోవడం చాలా బాధాకరమన్నారు. దీంతో ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగు తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసమే వృద్ధురాలి హత్య

● మరిది కొడుకు ఘాతుకం

● కేసును ఛేదించిన పోలీసులు



నర్సమ్మ మృతదేహం

పరిగి, ఫిబ్రవరి 18:. ఆస్తి కోసం వృద్ధురాలిని వరుసకు మనుమడైన వ్యక్తి హత్య చేశాడని పరిగి సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆదివారం వివరాలు వెల్లడించారు. గడిసింగాపూర్‌లో హరిజన నర్సమ్మ(70) ఈనెల 16వ తేదీన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నర్సమ్మది హత్యగా తేల్చారు. నర్సమ్మ భర్త ఎల్లయ్యకు ఇద్దరు తమ్ముళ్లు. ఈ ముగ్గురన్నదమ్ములకు కలిపి 2.28ఎకరాల భూమి ఉంది. ఎల్లయ్య చనిపోయిన తర్వాత భూమి మొత్తం నర్సమ్మ పేరిటే నమోదైంది. నర్సమ్మ దంపతులకు సంతానం లేరు. తమ వాటా భూమి పంచివ్వాలని పలుమార్లు మరుదులు అడిగినా నర్సమ్మ ఇవ్వలేదు. రైతుబంధు, పీఎం కిసాన్, పింఛన్ డబ్బులు, 35కిలోల బియ్యం ఆమె తీసుకునేది. ఇవి తనకు ఇవ్వాలని నర్సమ్మ మరిది రాములు కొడుకు గణేశ్ నానమ్మతో గొడవ పడేవాడు. కానీ ఈ డబ్బులను నర్సమ్మ తన తమ్ముళ్లు, చెల్లెళ్లకు ఇచ్చేది. నానమ్మను హత్య చేస్తేనే భూమి తనకు దక్కుతుందని గణేశ్ పథకం వేశాడు. ఈనెల 15న గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న నర్సమ్మ ముఖంపై గణేశ్ గుడ్డి, చీరగొంగు, వైరుతో బిగించి హత్య చేశాడని సీఐ శ్రీనివాస్ వివరించారు. గణేశ్‌ను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై అవగాహన



జ్యూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

నవాబుపేట, ఫిబ్రవరి 18:ఎల్లకొండ, పులుమామిడి, నవాబుపేట సంతల్లో ఆదివారం బీజేపీ నాయకులు ప్రజలకు ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపైఅవగాహన కల్పించారు. జేకేఎంఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చేవేళ్ల మాజీ ఎంపీ కె. విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో ప్రజలకు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎస్.జగన్, దళిత మోర్చా అధ్యక్షుడు గాలయ్య, సోషల్ మీడియా కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు శివప్రభు, నర్సింహులు, నర్సింహాచారి, శ్రీధర్‌రావు, రామకృష్ణారెడ్డి, మణికంఠరెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి ముక్తి ధామం 19వ వార్షికోత్సవం

శామీర్‌పేట, ఫిబ్రవరి 18 : శామీర్‌పేటలోని సాయి ముక్తి ధామంలో 19వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుడు నరేంద్రబాబు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం ప్రార్థన, కాకడ హారతి, మంగళ స్నానం, అభిషేకం, గోపూజ, ఆలయ ప్రదక్షిణం, గణపతిపూజ, రక్షాబంధనం, అఖండ దీపాస్థాపనం, నవగ్రహ ఆరాధనం, మహాన్యాస రుద్రాభిషేకం, అష్టోత్తర శతకళాభిషేకాది పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం చేపట్టారు. సాయంత్ర సహస్ర నామార్చన, గణపతి హోమం, గురు దేవత హోమం, ఆశీర్వచనం, సంధ్యా హారతి పూజలు చేశారు. రాత్రి సేజ హారతి జరిపారు. మండలంలోని వివిధ గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున వచ్చి సాయిబాబాను దర్శించుకున్నారు.



శ్రీసాయి ముక్తిధామం వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న భక్తులు



కాచవానిసింగారంలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 18: మండలంలోని కాచవానిసింగారంలో గల సర్వే నంబర్ 66లో గల ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాల ఆదివారం అధికారులు కూల్చి వేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా తహసీల్దార్ డీఎస్ రజిని హెచ్చరించారు. ఆర్‌ఐ సాయిరాం సిబ్బందితో వెళ్లి మూడు బేస్మెంట్లను, అలాగే ఓ ఇంటి నిర్మాణాన్ని కూల్చివేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ప్రజావసరాలకు కేటాయించినవని, వాటిని ఎవరు కబ్జా చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

క్రీడా ప్రాంగణాన్ని పట్టించుకోరా?

బషీరాబాద్, ఫిబ్రవరి 18: మండలంలోని కాశీంపూర్ శివారులో రోడ్డు పక్కన గతంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దీని నిర్వహణను పట్టించుకునే వారే లేకుండా పోయారు. ఈ ప్రాంగణం బోర్డు 6 నెలల కింద గాలిదూమరానికి కూలిపోయింది. గ్రామస్తులు తెలియజేయడంతో అప్పట్లో పంచాయతీ రాజ్ అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారు. మరి బోర్డును సరిచేయనే లేదు. బోర్డు కిందపడి జంగుపట్టి అక్షరాలు కన్పించకుండా పోతున్నాయి. పిల్లర్లు నేలమట్టం అయ్యాయి. దీన్ని చూస్తూ గ్రామస్తులు అధికారుల పని తీరుకు ఇదే నిదర్శనం అని ఎండగడుతున్నారు.



కాశీంపూర్‌లో పడిపోయిన క్రీడా ప్రాంగణం బోర్డు

ప్రత్యేకాధికారులకు మార్గదర్శకాలు

- పంచాయతీల్లో జాయింట్ చెక్ పవర్
- పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు
- రెండు నెలకోసారి గ్రామ సభ



గ్రామపంచాయతీ భవనం

తాండూరు, ఫిబ్రవరి 18 : గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, కార్యదర్శులకు జాయింట్‌గా చెక్ పవర్‌ను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ నెల 2 నుంచి గ్రామపంచాయతీలలో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైన విషయమైన విషయం తెలిసింది. రికార్డులను పంచాయతీ కార్యదర్శి ఆధీనంలోనే ఉండేలా చూసుకోవాలని ఉత్తర్వుల్లో సూచించారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఖచ్చితంగా రెండు నెలకోసారి గ్రామ సభను నిర్వహించాలని పేర్కొన్నారు. గృహనిర్మాణ అనుమతులు, లైసెన్సులు, ఆన్‌లైన్స్‌లను జారీ చేయాలని ఆదేశాలిచ్చారు. జమ, ఖర్చు వివరాలు, పక్కాగా నిర్వహించాలని, లేకుంటే క్రమశిక్షన చర్యలుంటాయని హెచ్చరించారు. ఇంటి పన్నుల డిమాండ్ నోటీసులను వెంటనే జారీ చేయాలని, ఎలక్ట్రికల్ మెటీరియల్‌ను టెండర్ ద్వారా కొనుగోలు చేయాలని సూచించారు. మంచినీటిసదుపాయం వీధిదీపాల నిర్వహణతోపాటు సీసీచార్జీలు కట్టాలని చెప్పారు. పారిశుధ్య పనులను ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మున్సిపాలిటీలో ఫ్రీ పబ్లిసిటీ

- పాలకమండలి ఆదాయానికి గండి
- అడ్డగోలుగా వెలుస్తున్న హోర్డింగ్‌లు

తాండూరు, ఫిబ్రవరి 17 : పట్టణంలో అనధికార ఫ్రీ పబ్లిసిటికి అడ్డూ, అదుపూ లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోడ్డింగ్‌లు వెలుస్తున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం నిద్రపోతోంది. మున్సిపాలిటీ అనుమతి లేకుండా పలువురు ఏర్పాటు చేసుకున్న బ్యానర్లు, హోర్డింగ్‌లు కనిపించినా వాటిని చూసీ చూడనట్లుగా వెళ్ళిపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఏ అనుమతి లేకుండా హోర్డింగులను ఏర్పాటు చేసిన వారికి కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదంటే టౌన్‌ప్లానింగ్ విభాగం ఉన్నట్లా? లేనట్లా? అని ఎద్దేవా చేస్తున్నారు. వికారాబాద్ జిల్లాలోనే తాండూరు మున్సిపాలిటీ పెద్దది. వ్యాపార కేంద్రం కావడంతో రోజూ వేలాది మంది వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో పట్టణంలో పలు ప్రచారాల కోసం ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, పోస్టర్లను పెడుతున్నారు. వీటన్నింటినీ పలువురు అనుమతి లేకుండానే ఏర్పాటు చేస్తున్నారు. అది కూడ ఒక్కరోజో, రెండు రోజులలో కాదు.. నిబంధనలకు విరుద్ధంగా ప్రకటనల రుసుము చెల్లించకుండా దర్జాగా నెలల తరబడి ప్రచార బోర్డులు పెట్టుకుని వ్యాపార సంస్థలు ప్రచారం చేసుకుంటున్నాయి. పట్టణంలో ప్రధాన వ్యాపార కూడళ్ళు, రద్దీ ప్రాంతాలైన ఇందిరాచౌక్, బస్టాండు, విలియమూన్ చౌరస్తాలో యథేచ్ఛగా ఏర్పాటు చేస్తున్నారు.

జరిమానాలు విధించేనా..

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న హోర్డింగ్‌లపై మున్సిపాలిటీ జరిమానాలు విధించాలని, ఒక్కోరకమైన ప్రకటన కోసం నిబంధనల ప్రకారం రుసుము వసూలు చేయాని పలువురు చెబుతున్నారు. మున్సిపాలిటీ ఆదాయం సమకూరుతుందని అంటున్నారు. కాగా 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉండే అనధికార ప్రకనటకు రోజుకు రూ.లక్ష, 15 అడుగుల కంటే తక్కువ ఎత్తులో ఉంటే రోజుకు రూ.50 వేలు, స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికేట్ లేకుండా ప్రకటనలు ఉంటే రోజు రూ.50వేలు జరిమానాలు విధించవచ్చని నిబంధనలున్నాయి.



ఇందిరాచౌక్‌లో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు

భూకబ్జాదారులను శిక్షించాలి

- కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు కాకి ఈశ్వర్

మహేశ్వరం, ఫిబ్రవరి 18 : తాను కొనుగోలు చేసిన వ్యవసాయ భూమిని కబ్జాచేసి, భూమిలోకి వస్తే చంపుతామని మహేశ్వరం గ్రామానికి చెందిన కాకి లక్ష్మయ్య అతని కుమారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్ చెప్పారు. ఆదివారం మండల కేంద్రంలోగల బొడ్రాయివద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక, ఎదుర్కోలేక తమపై పలువురు భూకబ్జా ఆరోపణలు చూస్తూ, కిరాయి గూండాలతో తనను చంపడానికి ప్రయత్నిస్తున్నారన్నారని ఆరోపించారు. మహేశ్వరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 87లో తన తల్లికి 3 ఎకరాల 20 గుంటల భూమి ఉండడంతో, ఆమె ద్వారా తనకు, తన సోదరులయిన కాకి లక్ష్మయ్య, సత్యనారాయణ, కుమార్‌కు ఒక్కొక్కరికి 35 గుంటల భూమిని గిఫ్ట్ డీడ్ చేశారని చెప్పారు. తన సోదరుడు కాకి లక్ష్మయ్య తన వాటాకు వచ్చిన 35 గుంటల భూమిని 2012లో హైదరాబాదుకు చెందిన మేకల దామోదర్‌రెడ్డికి విక్రయించారని, 2022లో మేకల దామోదర్‌రెడ్డివద్ద నుంచి తాను ఆ భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకొని పట్టా, పాసుబుక్కు పొంది రెవెన్యూ రికార్డుల్లో పేరు నమోదు చేసుకున్నానని చెప్పారు. కానీ లక్ష్మయ్య ఆయన కుమారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబసభ్యులను బెదిరిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతే కాకుండా తానే భూకబ్జాకు పాల్పడ్డానని అసత్యపు ప్రచారం చేయించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని, వారిపై పరువునష్టం కేసు వేస్తానని చెప్పారు. తన భూమి కేసుకు కాంగ్రెస్ పార్టీకి ఏ సంబంధం లేదని, కావాలని పార్టీకి భూమి కేసును అంటగట్టి దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. తాను ఎవరి భూమిని కబ్జా చేయలేదని ఈశ్వర్‌ముదిరాజ్ అన్నారు.



మాట్లాడుతున్న ఈశ్వర్‌ముదిరాజ్

ముగిసిన సతీషన్ నాయర్ అంత్యక్రియలు

- పాల్గొన్న ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాష్‌గౌడ్, డాక్టర్ వంశీ
- భారీగా తరలివచ్చిన అయ్యప్ప భక్తులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 18 : ప్రముఖ అధ్యాత్మిక గురువు, అయ్యప్ప స్వామి పరమ భక్తుడు, గురుస్వామి శ్రీశ్రీశ్రీ సతీషన్‌నాయర్(75) అంత్యక్రియలు ఆదివారం మండల పరిధిలోని పాల్మాకులలో ముగిశాయి. ఆయన అంత్యక్రియలకు ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాష్‌గౌడ్, డాక్టర్ వంశీ, సీడబ్ల్యూసీ ఆహ్వానిత సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, జడ్పీటీసీ నీరటి తన్వీరాజు, ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డితో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి అయ్యప్ప భక్తులు వేలాదిగా తరలివచ్చి అంతియ యాత్రలో పాల్గొన్నారు. సతీషన్‌నాయర్‌ను కడసారి చూసేందుకు క్యూ కట్టారు. కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. నలభై ఏళ్లుగా షాద్‌నగర్, శంషాబాద్, కేశంపేట్, జడ్చర్ల, బాలనగర్, ఆమన్‌గల్లు, కొందుర్గుతో పాటు రంగారెడ్డి జిల్లాలోని అనేక మండలాల్లో ఆయన అయ్యప్ప మాలధారణ చేయించే వారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజుల క్రితం నగరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే.



సతీషన్‌నాయర్ పాడె మోస్తున్న వీర్లపల్లి శంకర్

పాడె మోసిన ఎమ్మెల్యే వీర్లపల్లి

సతీషన్‌నాయర్ అంత్యక్రియల్లో పాల్గొన్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆయన పాడె మోశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గురుస్వామి గురించి తెలిసిన ప్రతీ ఒక్కరికి ఇది విషాదకరమని చెప్పారు. ఎంతో మంది యువతను ఆయన అధ్యాత్మిక మార్గంలో నడిపించారని పేర్కొన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పాల్మాకుల పీఏసీఎస్ చైర్మన్ శ్రవణ్‌కుమార్‌గౌడ్, స్థానిక సర్పంచ్ పంతంగి సుష్మారాజ్‌భూపాల్‌గౌడ్, ఎంపీటీసీ ఎల్లయ్య, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి చెట్టుపై విద్యుత్ షాక్

- పట్టు కోల్పోయి వేలాడుతూ ఆర్త నాదాలు
- కాపాడిన స్థానికులు

కీసర రూరల్, ఫిబ్రవరి 18 : విద్యుత్‌షాక్‌కు గురై ఒక గీతకార్మికుడు తీవ్ర గాయాల పాలైన ఘటన ఆదివారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వరంగల్‌కు చెందిన వీరయ్య బతుకుదెరువు కోసం కీసర మండలం యాద్గార్‌పల్లికి వచ్చాడు. స్థానిక కల్లు వ్యాపారస్తుల వద్ద గీత కార్మికునిగా చేరాడు. కాగా సాయంత్రం కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. చెట్టు పక్కనే 11కేవీ విద్యుత్తు వైర్లు ఉండగా వీరయ్య చెట్టు ఎక్కగానే గాలి వీయటంతో తాటి కమ్మలు విద్యుత్తు వైర్లకు అనుకున్నాయి. దీంతో చెట్టుపైన ఉన్న వీరయ్యకు విద్యుత్ షాక్ తగిలింది. పట్టు కోల్పోయిన అతను వెల్లకిలపడి, మోకుపై వేళాడుతూ కేకలువేసాడు. ఇది గమనించిన స్థానికులు అతన్ని ఎక్స్‌కవేటర్ సహాయంతో చాకచక్యంగా చెట్టుపై నుంచి కిందికి దింపారు. చికిత్స నిమిత్తం వెంటనే 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. అతని కాలుకు, చేతికి గాయాలయ్యాయని వైద్యులు చెప్పారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



తాటి చెట్టు పై వేలాడుతున్న వీరయ్య

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరి దుర్మరణం

కందుకూరు, ఫిబ్రవరి 18 : ఎదురెదురుగా వెళుతున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం కందుకూరు పోలీ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, కందుకూరు పోలీసులకు ఇచ్చిన సమాచాం మేరకు వివరాలు ఇలావున్నాయి. మండల కేంద్రంలో ఉండే సుదర్శనాచారి(40) కార్పెంటర్‌గా పనిచేసేవాడు. ఆదివారం సాయంత్రం మండంలోని మీర్కాన్‌పేట గ్రామం నుంచి మండల కేంద్రానికి బైక్‌పై వస్తున్నాడు. యాచారం మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన చిలుకల రమేష్(35) ద్విచక్రవాహనంపై కందుకూరు మండల కేంద్రం నుంచి తన సొంత గ్రామానికి వెళుతుండగా మండలంలోని అన్నోజిగూడ గ్రామ గేటు సమీపంలో వారి బైక్‌లు ఎదురెదురుగా బలంగా ఢీనడంతో ఇద్దరికి బలంగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ఆటోలో తరలిస్తుండగా ఇద్దరు మార్గ మధ్యలో మృతి చెందారు. కందుకూరు సీఐ మక్బుల్‌జానీ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభించారు.. మధ్యలోనే నిలిపేశారు

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 18 : మండల పరిధిలోని అజీజ్‌నగర్ పాత చౌరస్తా నుంచి బాకారం జాగీర్‌కు వెళ్లే రోడ్డు పనులను ఆర్అండ్‌బీ అధికారులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేయడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బంధులు పడుతున్నారు. అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీ, నాగిరెడ్డిగూడ గ్రామం వరకు సీఆర్ఆర్ (కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్డు) నిధులతో డబుల్ లైను రోడ్డు నిర్మాణం కోసం గతంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఆ పనులు 70 శాతం పూర్తి అయ్యాయి, కానీ మిగతా పనులను అధికారులు విస్మరించారు. పాతచౌరస్తా నుంచి అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీకి వచ్చే మార్గంలో శ్రీనిధి ఇంటర్‌నేషనల్ పాఠశాల ముందు నుంచి 800 మీటర్ల మేర నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఆ మార్గంలో ప్రయాణించాలంటే జంకుతున్నారు. దుమ్ము ధూళి, గుంతలతో నరకయాతన అనుభవిస్తున్నారు. సంబంధిత అధికారులు మొద్దునిద్ర వీడి మిగిలిన పనులను పూర్తి చేయాలని అజీజ్‌నగర్ గ్రామస్థులు కోరుతున్నారు.



రోడ్డుపై లేస్తున్న దుమ్ము

కంకర తేలిన రోడ్డుపై ప్రయాణం నరకం

- ప్రయాణికుల ఇబ్బందులు
- నిధులు మంజూరైనా మధ్యలో నిలిచిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 18 : మండలంలోని పలు రోడ్లు కంకర తేలి గుంతలమయంగా మారడంతో తమ ప్రయాణం నరకంగా మారిందని మండల ప్రజలు వాపోతున్నారు. పాడైన రోడ్లకు సంబంధిత అధికారులు మరమ్మత్తులు చేయించడం లేదు. నిత్యం రద్దీగా ఉండే సింగిల్ రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయి. లాల్‌పహడ్ నుంచి తుమ్మలపల్లి, వనంపల్లి, వికారాబాద్ జిల్లా కంకల్‌కు వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా పాడైంది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాగా ఉన్నప్పుడు వేసిన బీటీ రోడ్డు నేటికీ మరమ్మత్తులకు నోచుకోవడం లేదని ఆయా గ్రామా ప్రజలు వాపోతున్నారు. రోడ్డుపై గోతులుగా మారి ప్రమాదాలు జరుగుతున్నా ఆర్అండ్‌బీ పరిధిలోని ఈ రోడ్డు ఎన్నో ఏళ్ల గా మరమతులు కూడా చేయడం లేదు. ఈరోడ్డు వైపు ఆర్ఆండ్‌బీ అధికారులు కనీసం కన్నెత్తి చూడడం లేదు. ఈ రోడ్డు 3కిలో మీటర్లు ఉమ్మడి వికారాబాద్ జిల్లాలో ఉన్నందున పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు గోడు వెల్లబోస్తున్నారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేనా...

గత ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనుల కోసం లాల్‌పహడ్ నుంచి చలివేంద్రంపల్లి, వీరన్నపేట్, పెద్ద ఎల్కిచర్ల, గాలిగూడ వరకు రోడ్డు విస్తరణ పనులకోసం దాదాపుగా రూ.6.5కోట్ల నిధులు మంజూరు చేసింది. కానీ ఆ పనులు లాల్‌పహడ్ నుంచి చౌదరిగూడ, జిల్లేడ్ వరకే పూర్తయ్యాయి. పెద్ద ఎల్కిచర్ల నుంచి గాలిగూడ వరకు పూర్తి చేశారు. మిగితా పనులు చెన్నారెడ్డిగూడ నుంచి చలివేంద్రంపల్లి వరకు, చేగిరెడ్డి ఘణాపూర్ నుంచి పెద్ద ఎల్కిచర్ల వరకు బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. కొత్త ప్రభుత్వం ఈ రోడ్డు పనులపై ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

ఏళ్ల తరబడి తప్పని తిప్పలు



లాల్‌పహడ్ నుంచి కంకల్‌కు వెళ్లే బీటీ రోడ్డు అక్కడక్కడ బీటీ తొలగిపోవడంతో వాహనాలను నడపాలేకపోతున్నాం. రాత్రి సమయాల్లో ఈ సింగిల్ రోడ్డుపై చాలా మందికి ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ చేసి డబుల్ రోడ్డు వేయాలి.

-లింగంగారి మల్లారెడ్డి, వనంపల్లి, జిల్లేడ్-చౌదరిగూడ



లాల్‌పహడ్ నుంచి వికారాబాద్‌కు వెళ్లే రహదారి

ఎవరూ పట్టించుకోవడం లేదు



బీటీ రోడ్డు మరమత్తుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. అసలే సింగిల్ రోడ్డు వర్షాలకు అది కూడా పూర్తిగా దెబ్బతిన్నది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయలేక ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు మరమత్తు పనులపై ప్రభుత్వం దృష్టి సారించాలి. రాత్రి పూట వెళ్తే ప్రమాదాలు తథ్యం.

-కుమ్మరి హరీష్, వీరన్నపేట్, జిల్లేడ్ చౌదరిగూడ

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు

- బలవుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు

బషీరాబాద్, ఫిబ్రవరి 18 : మండలంలోని పలు గ్రామాల్లో, చేన్ల వద్ద చాలా చోట్ల ఒరిగిన స్తంబాలు, కంచెలేని ట్రాన్స్‌పార్మర్లు, వేలాడుతున్న తీగాలతో ప్రజలు, మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, రైతులు భయందోళనల చెందుతున్నారు. మండలంలో విద్యుత్ సమస్యలపై మొర పెట్టుకుంటున్నా పట్టించుకునేనాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లో ఓల్టేజీ సమస్యను నివారించడానికి ట్రాన్స్‌పార్మర్లను ఏర్పాటు చేస్తున్న ఆ శాఖ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. మండల పరిధిలోని ఎక్మాయి, క్యాద్గీరా, మైల్వార్, నవాల్గ, బషీరాబాద్ గ్రామాలు, తండాల్లో విద్యుత్ సమస్యలు అనేకం ఉన్నాయి. ఇళ్ల సమీపంలో కూడా స్తంబాలకు విద్యుత్ తీగలు వేలాడతున్నాయి. పలు చోట్ల ట్రాన్స్‌పార్మర్లకు కంచె లేక మూగజీవాలు విద్యుత్‌షాక్‌కు గురై మృత్యువాత పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వేలాడుతున్న తీగాలు సరి చేయాలని విద్యుత్ ఏఈ, సిబ్బంది చుట్టూ తిరగుతున్నా పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో కరెంట్ సమస్యలపై ఏఈపై సభ్యులు పలువురు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆ తర్వాత అంతా షరామామూలేనని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



ఫెనిసంగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్

అధికారులు స్పందించాలి



గ్రామంలో విద్యుత్ తీగలు పలుచోట్ల వేలాడుతున్నాయి. చేతి కందేంత ఎత్తులోనే అవి ఉండటంతో ఎప్పుడేం జరుగుతుందోనని భయంభయంగా గడుతున్నాంజ ట్రాన్స్‌పార్మర్లకు రక్షణ కంచె లేక మూగజీవాలు చనిపోతున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడంలేదు.

- సాయిరెడ్డి, రైతు, ఎక్మాయి

డబుల్ కన్ఫ్యూజన్

- బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూమ్‌లు
- కొత్త ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు ఎప్పుడో

పరిగి, ఫిబ్రవరి 18: కొత్త ప్రభుత్వంలో పేదల్లో 'డబుల్' కన్ఫ్యూజన్ నెలకొంది. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్‌లను నిర్మించినా అవి పూర్తికాక లబ్ధిదారులకు కేటాయించలేదు. ఏడేళ్లుగా వాటి నిర్మాణం కొనసాగుతోంది. ఇదిలా ఉండగా పేలు తమ సొంత స్థలంలో ఇంటిని నిర్మించుకుంటే దాని కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇవ్వడం, దాన్ని అమలు చేస్తామని చెబుతుండడంతో ప్రజలు ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు పెట్టుకున్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500ఇళ్లు మొదటి విడతలో కేటాయిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. గత ప్రభుత్వం ప్రారంభించిన నియోజకవర్గానికి 680 డబుల్ బెడ్‌రూమ్‌లను మంజూరు కాగా 2015 అక్టోబర్ 22న శంకుస్థాపన చేశారు. కొన్ని నిర్మాణాలు పూర్తి కాగా, మరిన్ని వివిధ స్థాయిల్లో ఉన్నాయి. ఇప్పుడు పూర్తయిన ఇళ్లకు లబ్దిదారులను ఎంపిక చేస్తారా? మల్లా దరఖాస్తులు తీసుకుంటారా? అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని స్వాగతిస్తున్నాం. కానీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా లబ్ధిదారులకు కేటాయించాలని ఇళ్లు లేని పేదలు కోరుతున్నారు.



పరిగిలో పూర్తయిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు

పేదలందరికీ ఇళ్లు కట్టించి ఇస్తాం

ప్రభుత్వంలో పేదలందిరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం. నియోజకవర్గానికి మొదటి విడత 3,500 ఇళ్లు మంజూరయ్యాయి. గతంలో తీసేసిన హౌజింగ్ శాఖను తిరిగి ఏర్పాటు చేసి, ఆ శాఖ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన డబల్ బెడ్‌రూమ్‌లను కూడా త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించేలా చర్యలు తీసుకుంటా. ఇదిలా ఉంటే ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మాత్రం పేదవారికి సొంతంటి కల నేరవేస్తాం.

- టి.రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి



కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 18 : ఒక బైక్‌పై ఇద్దరు లేదా ముగ్గురు ప్రయాణించడం సాధారణంగా చూస్తుంటాం..కానీ కొడంగల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం ఓ వలస జీవి తన బైక్‌పై మూటముల్లె, కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాదకరంగా ప్రయాణించడం ఆంధ్రజ్యోతి కంట పడింది.


అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతినిధుల ప్రమాణం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 18 : అంబేడ్కర్ ఆశయ సాధనకు మనందరం కృషిచేయాలని ఎన్ఎఫ్‌సీనగర్ గోర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.రాములు అన్నారు. ఆదివారం అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ప్రబుద్ధ భారత్ ఆధ్వర్యంలో ఎదులాబద్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంతోనే అనగారిన వర్గాలకు మేలు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మీసాల అనున్‌కుమార్, దాను, నర్సింగరావు, రాజేష్, సంతోష్‌కుమార్, గణేష్, నారాయణ, సత్యం, వెంకటేశ్వర్లు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

తాండూరు నియోజకవర్గానికి మొదటి విడత
4వేల ఇందిరమ్మ ఇళ్లు



మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరురూరల్, ఫిబ్రవరి 18: తాండూరు నియోజకవర్గానికి మొదటి విడతలో 4వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులకు పంపిణీ చేస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నారాయణపూర్ సమీపంలోని రవ్వలకొండ రామస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మల్లికార్జునస్వామి జాతరలో పాల్గొన్నారు. గ్రామానికి మొదటిసారిగా వచ్చిన ఎమ్మెల్యేను వివేకానంద యువజన సంఘం ప్రతినిధులు ఉప్పరి రాజు, శ్రీశైలం, కాంగ్రెస్ నాయకులు బాల్‌రెడ్డి, నర్సింహులు, అంజిలప్ప, శివరాంరెడ్డి, పకీరప్ప, నాగరాజు తదితరులు సత్కరించారు. యువజన సంఘం తరఫున గజమాలతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామస్వామి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేస్తామన్నారు. రైల్వేట్రాక్ పక్కన ఫార్మేషన్ రోడ్డును బీటీగా మార్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అయితే రోడ్డుకు భూమి ఇచ్చేలా రైతులతో గ్రామస్తులు చర్చించాలని కోరారు. నిధులు ఎన్నైనా మంజూరు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుటుందన్నారు. ప్రస్తుతం రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంటు పథకాలు వర్తింపజేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. అలాగే పేద మహిళలకు నెలకు రూ.2,500లు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. తనకు ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతగా గ్రామ రూపురేఖలు మారుస్తానన్నారు. కార్యక్రమంలో ఎల్మకన్నె ప్యాక్స్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, నవాంద్గి సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, వెంకటప్ప, నర్సప్ప, అనంతప్ప, శ్యామప్ప పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన 'పట్నం' దంపతులు



ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేందర్‌రెడ్డి దంపతులు

వికారాబాద్, ఫిబ్రవరి 18 : అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి దంపతులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని స్పీకర్ నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. సునీత కాంగ్రెస్‌లో చేరడంతో జిల్లా అభివృద్ధి అంశాలపై చర్చించారు.

కాలనీలో సీసీ పనులకు శంకుస్థాపన



కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు, ఫిబ్రవరి 18: ధారూరులోని శాలివాహన కాలనీలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రారంభించారు. రోడ్డు పనులకు ఉపాధి హామీ కింద రూ.5లక్షలు మంజూరయ్యాయి. కుమ్మరి పండరి ఇంటి నుంచి వీరభద్రేశ్వర ఆలయం వరకు రోడ్డు వేస్తున్నారు. కార్యక్రమంలో బుజ్జయ్యగౌడ్, కిరణ్ కుమార్, బాబాఖాన్, అమరేశ్వర్, అంజయ్య, ఇబ్రహీం, రవి, పాల్గొన్నారు.

భూ కైలాస్ ఆలయాన్ని సందర్శించిన సీఐ, వైస్ ఎంపీపీ



భూ కైలాస్ ఆలయంలో రూరల్ సీఐ అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆలయ వ్యవస్థాపకులు వాసు పవార్ తదితరులు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 18: మండలంలోని ప్రసిద్ధ భూ కైలాస్ ఆలయాన్ని రూరల్ సీఐ అశోక్‌కుమార్ సందర్శించారు. ఆదివారం ఆలయంలో శివుడిని సందర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు వాసు పవార్ రూరల్ సీఐని శాలువాతో సన్మానించారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని సీఐని కోరారు. అలాగే అంతకు ముందు పెద్దేముల్ మండల పరిషత్ వైస్ ఎంపీపీ మధులతశ్రీనివాసాచారి సైతం కుటుంబ సమేతంగా భూ కైలాస్ ఆలయాన్ని సందర్శించి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

జ్యోతిర్లింగానికి పడిపూజ



జ్యోతిర్లింగ పడిపూజలో పాల్గొన్న శివస్వాములు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 18: మండలంలోని హస్నాబాద్‌లో ఆదివారం తుంకిమెట్ల మల్లప్ప నివాసంలో శివస్వాములు జ్యోతిర్లింగ పడిపూజను ఘనంగా నిర్వహించారు. హస్నాబాద్‌తో పాటు పరిసర గ్రామాల 300 మంది శివస్వాములు పూజలో పాల్గొన్నారు. పూజల అనంతరం శివస్వాములు తీర్థప్రసాదం స్వీకరించారు.

స్నేహితుడి కుటుంబానికి లక్ష ఆర్థిక సాయం



స్నేహితుడి భార్యకు రూ.లక్ష సాయం అందజేస్తున్న డిగ్రీ బ్యాచ్‌మేట్లు

పరిగి, ఫిబ్రవరి 18 : డిగ్రీ బ్యాచ్‌మేట్ అకాల మృతితో ఇబ్బందులు పడుతున్న అతడి కుటుంబాన్ని చూసి చలించిన స్నేహితులు ఆర్థిక సాయం చేసి బాసటగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. కులకచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన మహిపాల్ ఇటీవల చనిపోయాడు. అతడికి భార్య లక్ష్మి, కూతురు ఉన్నారు. పరిగిలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో అతడితో కలిసి బీకాం చదివిన 2008-11 బ్యాచ్‌మేట్లు అందరు రూ.లక్ష జమ చేశారు. ఈ డబ్బును ఆదివారం మండలంలోని ఇబ్రహీంపూర్‌లో ఉంటున్న మహిపాల్ భార్యకు మాజీ సర్పంచ్ బాలయ్య చేతుల మీదుగా అందజేశారు. భవిష్యత్తులోనూ తన స్నేహితుడి కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

ఉర్సుకు ఎస్సైకి ఆహ్వానం



ఎస్సైకి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

బషీరాబాద్, ఫిబ్రవరి 18: బషీరాబాద్‌లో ఈ నెల 20, 21, 22 తేదీల్లో జరిగే హజ్రత్ శంషాఖాద్రీ దర్గా ఉర్సు ఉత్సవాలకు రావాలని దర్గా కమిటీ ఆదివారం స్థానిక ఎస్ఐ రమేష్‌కు ఆహ్వాన పత్రికను అందజేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్.వెంకటేష్, జి.మాధవరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ నిర్వహకులు మునీర్, ఖలీద్ తదితరులు ఎస్సైకి ఆహ్వాన పత్రికను అందజేశారు.

ధ్యానంతో బీపీ, షుగర్‌ల అదుపు

దోమ, ఫిబ్రవరి 18: నిత్య జీవితంలో శ్వాసపై ధ్యాసతో ధ్యానం చేయడం ద్వారా బీపీ, షుగర్ లాంటి వ్యాధులను అదుపులో ఉంచుకోవచ్చని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటి ధ్యాన ప్రచార కార్యదర్శి బి.ఆంజనేయరెడ్డి, ధ్యాన ప్రచార నిర్వాహకులు నవీన్ అన్నారు. గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటి ప్రమాదకర జబ్బులు కూడా రోజూ గంట పాటు ధ్యానం చేస్తే నయం అవుతాయన్నారు. ఆదివారం మండలంలోని శివారెడ్డిపల్లి, బొంపల్లి, బాసుపల్లి, గొడుగోనిపల్లి, దోర్నాలపల్లి గ్రామాల్లో ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా రోజూ ధ్యానం చేస్తూ శాకాహారిగా జీవించే వారికి సత్ఫలితాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకృష్ణారెడ్డి, నవీన్, సురేశ్‌రెడ్డి, శైలజ, శోభిత, యాదయ్య, చెన్నయ్య, వేణు, బాబు పాల్గొన్నారు.



దోర్నాలపల్లిలో ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న ప్రచారకర్త నవీన్

హస్నాబాద్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



హస్నాబాద్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్, ఫిబ్రవరి 18: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో ఉపాధి హామీ స్కీం కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆదివారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్, పీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి



పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ సుల్తానా

పరిగి, ఫిబ్రవరి 18 : పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధి చేస్తామని సయ్యద్ మల్కాపూర్ మాజీ సర్పంచ్ ఫైన్ సుల్తానా అన్నారు. ఉపాధి నిధులు రూ.10లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఆదివారం ఆమె శంకుస్థాపన చేశారు. గ్రామంలోని అన్ని వార్డుల్లో రోడ్లు, మురికికాలువల నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రహీం పటేల్, సాదక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 18: టిప్పర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి కొడంగల్ మండలం చిట్లపల్లి శివారులో జరిగింది. ఎస్సై భరత్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. చిట్లపల్లికి చెందిన తమ్మాని నర్సప్ప (60) పొలం నుంచి గ్రామానికి వెళ్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ అతడిని వెనక నుంచి ఢీకొట్టింది. టిప్పర్ వెనక టైర్లు నర్సప్పపై నుంచి వెళ్లడంతో శరీరం ఛిద్రమై రెండు ముక్కలైంది. ఈ ఘటనతో గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పలు గ్రామాల్లో యూజీడీ పనుల ప్రారంభం

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 18: కొడంగల్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సీసీ రోడ్డు పనులు, అండర్ గ్రౌండ్ డ్రెయిన్ పనులను నాయకులు ప్రారంభించారు. పెద్దనందిగామ, అన్నారం, టేకుల్ కోడ్, రుద్రారం, లక్ష్మీపల్లి, సంగాయిపల్లి తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను వేగవంతం చేశారు. టేకుల్‌కోడ్‌లో రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆదివారం ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రారంభించారు. కాగా పనులను నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్లకు వారు సూచించారు. అలాగే పనులు వేగవంతంగా, నాణ్యతతో చేయించుకోవాలని గ్రామస్తులను నాయకులు కోరారు.



టేకుల్‌కోడ్‌లో చేపట్టిన సీసీ రోడ్డు పనులు

అనంత బృందావన ఆశ్రమంలో 24 నుంచి జాతర

- 25న శివపార్వతుల కళ్యాణోత్సవం

పెద్దేముల్, ఫిబ్రవరి 18 : అనంత బృందావన ఆశ్రమంలో ఈ నెల 24 నుంచి జాతర నిర్వహిస్తామని ఆశ్రమ నిర్వాహకులు అనంతయ్యస్వామి ఆదివారం తెలిపారు. జనగాం సమీపంలో గల గువ్వలగుట్టలో అనంత బృందావన ఆశ్రమం ఉంది. ఇక్కడ పలు ఆలయాలు కొలకొని ఉన్నాయి. అందులో శనైశ్వర్య ఆలయం కూడా ఉంది. జాతర ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 24వ తేదీన శనివారం ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, మంగళహారతి, 8 గంటలకు శనైశ్వరుడికి తైలాభిషేకం, రేవణ సిద్ధేశ్వరుడికి అభిషేకం, లగ్న కార్యక్రమాలుంటాయి. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ ఉంటుంది. సాయంత్రం దీపారాధన, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 25న ఆదివారం ఉదయం పంచముఖ ఆంజనేయస్వామి అభిషేకం, పంచలింగాలకు అభిషేకం, గ్రామంలోని శివాలయం నుంచి పార్వతీపరమేశ్వరు విగ్రహాల ఊరేగింపు, అనంతరం దేవదేవుల కల్యాణోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా సిద్ధయ్యమఠం రామకృష్ణ పరబ్రహ్మ పాల్గొంటారని పేర్కొన్నారు. జాతర మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పొదల్లోకి దూసుకెళ్లిన కారు.. త్రుటిలో తప్పిన ముప్పు



పొదల్లోకి దూసుకెళ్లిన కారు

వికారాబాద్, ఫిబ్రవరి 18: వికారాబాద్-పరిగి రోడ్డులో డీటీసీ వద్ద ఆదివారం ప్రమాదం జరిగింది. పరిగి వెళ్తున్న కారు అదుపు తప్పి డీటీసీ ఫెన్సింగ్ పొదల్లోకి దూసుకెళ్లింది. చెట్టు, ఫెన్సింగ్‌కు తగిలి కారు నిలిచిపోవడంతో ముందున్న గుంతలో పడలేదు. లేదంటే కారు డ్రైవర్‌కు ముప్పు కలిగేది. మద్యం తాగి డ్రైవ్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు అన్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

బస్ కండక్టర్‌పై చేయి చేసుకున్న వ్యక్తిపై కేసు

పెద్దేముల్, ఫిబ్రవరి 18 : బస్సు కండక్టర్‌పై చేయి చేసుకున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్‌సాన్‌పల్లికి చెందిన లక్ష్మీబాయి శనివారం నగరంలోని మెహిదీపట్నంలో తన ఏడేళ్ల వయసు కలిగిన కుమారిడితో బస్సు ఎక్కింది. ఆమెకు ఫ్రీ టికెట్ కొట్టిన కండక్టర్ ఆమె కుమారుడికి టికెట్ తీసుకోవాలని కోరాడు. అందుకు ఆమె నిరాకరించి కండక్టర్‌తో గొడవపడింది. మన్‌సాన్‌పల్లిలో బస్సు దిగింది. తిరిగి బస్సు హైదరాబాద్ వెళ్లే సమయంలో మన్‌సాన్‌పల్లి వద్ద బస్సు ఆగింది. లక్ష్మీబాయి భర్త పత్లావత్ శ్రీనివాస్ బస్సు ఎక్కి కండక్టర్ నాగయ్యను దూషిస్తూ అతడిపై చేయిచేసుకున్నాడు. అడ్డుకున్న డ్రైవర్‌నూ ఇష్టారీతిన తిట్టాడు. ఈ విషయమై కండక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారని ఎస్ఐ గిరి తెలిపారు.

వసతుల్లేక జీవనం అస్తవ్యస్తం!

- పోతాయిపల్లి కాలనీ వాసుల ఇబ్బందులు..



కాలనీలో రోడ్డుకు నోచుకోని వీధి

శామీర్‌పేట్, ఫిబ్రవరి 18 : శామీర్‌పేట్ మండలం తూంకుంట మున్సిపాలిటీ 15వ వార్డుపరిధి పోతాయిపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ ఏర్పాటై ఏడాది అయినా మున్సిపాలిటీ ఇప్పటి వరకు తమకు ఎలాంటి సదుపాయాలు కల్పించలేదని స్థానికులు వాపోతున్నారు. తమ కాలనీకి రూ.17లక్షల మున్సిపల్ నిధులు విడుదలై ఆరు నెలలవుతున్నా అధికారులు పనులు చేయించడం లేదన్నారు. కాలనీలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించలేదన్నారు. మురుగు నీరు రోడ్లపై పారుతోందని, దోమలు, ఈగలతో రోగాల బారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై కమిషనర్, మునిసిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్ హరిబాబుకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నామని స్థానికులు తెలిపారు. అయినా వారెవరూ పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. రోడ్లు, డ్రెయిన్ల సమస్య ఇలా ఉంటే కాలనీకి ఇప్పటి వరకు మిషన్ భగీరథ పైప్‌లైన్ కూడా వేయలేదన్నారు. ఫ్లోరైడ్ నీరు తాగలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ తీసుకొని తమ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



కాలనీలోని సమస్యలు వివరిస్తున్న స్థానికులు



ఇళ్ల మధ్య నిలుస్తున్న డ్రెయినేజీ నీరు

దళిత బహుజన శ్రామిక యూనియన్ కార్యవర్గం ఎన్నిక



యూనియన్ కమిటీ సభ్యులతో లింగం సాయిలు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 18: దుద్యాల మండలం లగచర్లలో దళిత బహుజన శ్రామిక యూనియన్ గ్రామ కమిటీని జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం సాయిలు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాములు, ఉపాధ్యక్షుడిగా మహేశ్, కార్యదర్శిగా బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా నర్సిములు, కోషాధికారిగా చంద్రప్ప ఎన్నికయ్యారు.

కిడ్నాపర్‌గా భావించి యువకుడికి దేహశుద్ధి



ఉత్తమ్‌కుమార్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 18 : కిడ్నాపర్ అనుకొని ఓ యువకుడికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన ఉత్తమ్‌కుమార్(30) ఇటీవల ఉపాధి కోసం నగరానికి వచ్చాడు. అతడు మద్యానికి బానిసయ్యాడు. ఉద్యోగం దొరక్క తిరిగి సొంతూరుకు వెళ్లేందుకని రైల్లో బయల్దేరాడు. అతడు టికెట్ తీసుకోకపోవడంతో టీటీ అతడిని ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌లో దింపేశాడు. అక్కడి నుంచి ఉత్తమ్‌కుమార్ పక్కనే ఉన్న గాంధీనగర్ వైపు వెళ్లి అనుమానాస్పదంగా సంచరించడంతో స్థానికులు గమనించి 'ఎవరు నువ్వు?' అని అడిగారు. అతడు సరిగా సమాధానం చెప్పకపోడంతో పిల్లలను ఎత్తుకెళ్లేవాడని అనుమానించి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి ఉత్తమ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడు ఇచ్చిన సమాచారంతో పోలీసులు బిహార్‌లోని శివాస్ పోలీసులతో మాట్లాడారు. చివరకు అతడు కిడ్నాపర్ కాదని తేలింది. చివరకు పోలీసులు ఉత్తమ్‌కుమార్ బిహార్ వెళ్లడానికి రవాణా ఖర్చుల కోసం ఆర్థికసాయం చేసి బిహార్ రైలు ఎక్కించి పంపించారు.

దోమ నూతన ఎస్సైకి సన్మానం

దోమ, ఫిబ్రవరి 18: దోమ పీఎస్‌లో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్‌కుమార్‌ను బీసీ సంఘం ఆధ్వర్యంలో యువకులు సన్మానించారు.ఆదివారం స్టేషన్‌లో ఎస్సైని పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గోవర్దన్, బీజేవైఎం మండల అధ్యక్షుడు నర్సిములు, జిల్లా బీసీ సంఘం ప్రధానకార్యదర్శ సంజీవ్‌కుమార్, అనిల్‌కుమార్, రాములు, వెంకట్రాములు పాల్గొన్నారు.



ఎస్సైని సన్మానిస్తున్న యువకులు

నేడు వికారాబాద్‌లో శివాజీ శోభాయాత్ర

వికారాబాద్, ఫిబ్రవరి 18: శివాజీ జయంతిని పురస్కరించుకొని సోమవారం వికారాబాద్‌లో శోభాయాత్ర నిర్వహిస్తామని భక్తులు ఆదివారం తెలిపారు. ఆలంపల్లి హనుమాన్ ఆలయం నుంచి వికారాబాద్ హనుమాన్ ఆలయం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. అలాగే వికారాబాద్ పట్టణ పరిధి మద్గుల్ చిట్టంపల్లిలో నిర్మించిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. కార్యక్రమానికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

న్యూ హనుమాన్ నగర్ కాలనీ సంక్షేమ సంఘ కార్యవర్గం ఎంపిక

కీసర రూరల్, ఫిబ్రవరి 18 : కాలనీల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధి న్యూ హనుమాన్ నగర్ కాలనీ సమావేశాన్ని నిర్వహించారు. చైర్మన్ సమక్షంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కె.బాల్‌రెడ్డి, కోశాధికారి శ్రవణ్‌కుమార్, గౌరవ అధ్యక్షురాలిగా సరస్వతి, వర్కింగ్ ప్రెసిడెంట్ కందుల శ్రీనివాస్, గౌరవ సలహాదారులు జె.చంద్రశేఖర్‌శర్మ, గణేష్, ఉపాధ్యక్షులు రమేష్, అబ్బయ్య, సహాయ కార్యదర్శిగా ఎల్లారెడ్డి, పి.శ్రీను ఎంపికయ్యారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ కాలనీ సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.



కాలనీ నూతన అధ్యక్షుడు శ్యాంసుందర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ కె.చంద్రారెడ్డి

గుండెపోటుతో దినపత్రిక విలేకరి మృతి

కులకచర్ల, ఫిబ్రవరి 18: చౌడాపూర్ మండలంలో ఓ దినపత్రిక విలేకరి మరికల్ ఉదయ్(40) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. ఉదయ్ అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు మహబూబ్ నగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. ఉదయ్‌కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉదయ్ కుటుంబానికి సదరు దినపత్రిక విలేకరులు రూ.11,500, కేఎస్సార్ ట్రస్ట్ రూ.10 వేలు, వికారాబాద్ జిల్లా టీయూడబ్ల్యూజే(ఐజేయూ) తరఫున రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 18 : మండలంలోని దస్తగిరిపేట్ మైసమ్మగుడి వద్ద కొందరు పేకాట ఆడుతున్నట్లు తమకు సమాచారం అందడంతో దాడి చేసిన వారిని పట్టుకున్నామని తాండూరు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఆదివారం గ్రామంలోని మైసమ్మ ఆలయం వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు వెళ్లి పేకాట ఆడుతున్న పురుషోత్తం, ఆంజనేయులు, భీమప్ప, శ్రీనివాస్, వెంకటేశం, సాదిక్, దస్తప్ప పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని ప్యాక్ సెట్లు, రూ.12,210, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.